సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం ၊ 19 ၊ ఫిబ్రవరి ၊ 2025



జేసీబీతో రహదారిని తవ్వేశారు

ఏళ్ల తరబడి ఉన్న రహదారిని కొందరు వ్యక్తులు తవ్వేశారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని కోనం పేట నుంచి యర్రప్పగారిపల్లెకు వెళ్లే రహదారిని కొందరు జేసీబీతో తవ్వేశారు. - 8లో



ఉత్సవాలకు వేళాయె.. సందడి లేదాయె?

ప్రముఖ శైవ క్షేత్రం కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాల సందడి కనిపించడం లేదు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.90	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 64 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఒంటిమిట్ట రామయ్య హుండీ ఆదాయం లెక్కింపు



రామయ్య హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న టీటీడీ సిబ్బంది

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ టీటీడీ అధికారులు లెక్కింపు చేశారు. ఈ సందర్భంగా పరకామణి లెక్కింపు ముగిసే సమయానికి ఒంటిమిట్ట రామయ్య నెలసరి హుండీ ఆదాయం 8 లక్షల 620 రూపాయలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ఏఐటీయూసీ జిల్లా నూతన కమిటీ



ఏఐటీయూసీ అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి సాంబశివ

రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లా ఏఐటీయూసీ కార్యవర్గాన్ని మంగళవారం సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా తుమ్మల రాధాకృష్ణ, అధ్యక్షుడిగా మాదరాజు గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వర్రి సురేష్ కుమార్, కోశాధికారిగా సరోజమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడిగా గాలి చంద్ర, పోకూరి మురళి, నరసింహులు, ఉప ప్రధాన కార్యదర్శులుగా సలీం బాషా, సహాయ కార్యదర్శులుగా ఇ.సికిందర్, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ చైతన్యలను ఎన్నుకున్నారు.

తలనీలాల వేలం పాట రూ.5.51 లక్షలు



బహిరంగ వేల పాటను నిర్వహిస్తున్న ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి

సిద్దవటం: నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను బాపట్ల జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన వంగపాటి మహేంద్ర రూ. 5. 51లక్షలకు దక్కించుకున్నారని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్యపూజస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలకు మంగళవారం సిద్దవటంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో బహిరంగ వేలం పాట ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యపూజ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులు స్వామివారికి సమర్పించుకునే తలనీలాల ప్రోగు కోసం ఈ వేలం పాటను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ ఉద్యోగి చంద్ర , జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, పాటదారులు, వంతాటిపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టరేట్ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన సబ్ కలెక్టర్ కార్యాలయం

మదనపల్లె: పట్టణంలో నూతనంగా ఆధునికీకరించిన సబ్ కలెక్టరేట్ కార్యాలయాన్ని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా బుధవారం ప్రారంభించనున్నట్లు సబ్ కలెక్టరేట్ ఏఓ రాఘవేంద్ర తెలిపారు. గత ఏడాది జూలై 21న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. దీంతో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, కార్యాలయ ప్రాంగణంలోని హెచ్ఎన్ఎస్ఎస్-2 భవనంలో తాత్కాలికంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని పాలన సాగిస్తున్నారు. తర్వాత ప్రభుత్వం నుంచి భవనానికి మరమ్మతులు చేసేందుకు అనుమతులు రావడంతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో ముస్తాబుచేసి, ఫిబ్రవరి 19న ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటలకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ.సిసోడియా ఆధునికీకరించిన సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని సబ్ కలెక్టరేట్ అధికారులు తెలిపారు.



సూక్ష్మ సేద్యానికి పాతర!

- 2024–25 ఆర్థికంలో జిల్లాలో 30,950 హెక్టార్లకు లక్ష్యం
- తాజాగా 50 శాతం కుదించి.. 15వేల హెక్టార్లకే అమలు
- కోత విధింపుతో రూ.150 కోట్లు నష్టపోతున్న రైతులు
- జిల్లాలో ఇప్పటికి 9,526 హెక్టార్లకు సూక్ష్మ పరికరాలు
- ఖర్చు చేసింది రూ.78.80 కోట్లు
- మిగిలిన 5,474 హెక్టార్లు మార్చిలోగా పూర్తి



బి.కొత్తకోటలో డ్రిప్‌తో పంటల సాగు


బి.కొత్తకోట: సూక్ష్మ వ్యవసాయానికి చేయూత ఇవ్వాల్సిన ప్రభుత్వం దానికి పాతర వేస్తోంది. ఏ పథకానికైనా టార్గెట్ నిర్ణయించి అమలు చేయడం ఆనవాయితీ. అయితే దీనికి భిన్నంగా ఇచ్చిన టార్గెట్‌ను తగ్గించేస్తోంది కూటమి ప్రభుత్వం. 50 శాతం లక్ష్యాన్ని ఉన్న ఫళంగా కుదించేసింది. దీంతో ప్రతిపంట సాగుకూ డ్రిప్‌పై ఆధారపడిన రైతులు భారీగా నష్టపోతున్నారు. సూక్ష్మ పరికరాల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంటోంది. 2024–25 ఆర్థిక లక్ష్యంలో కోత విధించిన ప్రభుత్వం మిగిలిన లక్ష్యం సాధించి రైతులకు ప్రయోజనం చేకూర్చుతుందా అన్నది చూడాలి.

లక్ష్యం 30వేల హెక్టార్లు..

రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గేందుకు, తక్కువ నీటితో పంటలను సాగు చేసుకునేలా ప్రభుత్వాలు సూక్ష్మ వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తుంటాయి. కరువు ప్రాంత రైతాంగానికి ఇది ఎంతో ముఖ్యమైంది. ఏ ప్రభుత్వమైనా దీన్ని కొనసాగించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నమయ్య జిల్లా రైతాంగానికి 2024–25 ఆర్థిక సంవత్సరంలో 30,950 హెక్టార్లకు సూక్ష్మ సేద్యాన్ని విస్తరింపజేయాలని నిర్ణయించింది. రైతుల నుంచి అందే దరఖాస్తులకు డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లను 90 శాతం రాయితీతో మంజూరు చేస్తారు. ఇప్పటివరకు అమలులో ఉన్న విధానం మేరకు ఐదు ఎకరాలలోపు కలిగిన ఎస్సీ, ఎస్టీ, ఇతర రైతులకు 90శాతం రాయితీ, ఐదు ఎకరాల నుంచి పది ఎకరాలలోపు ఉన్న రైతులకు 70శాతం రాయితీ, పది ఎకరాలకుపైగా భూమి కలిగిన రైతులకు 50 శాతం రాయితీ అందిస్తారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన రాయితీ దీనికి వర్తించదు.

ఇప్పుడు 15వేల హెక్టార్లకే..

ప్రభుత్వం ఉన్నట్టుండి లక్ష్యాన్ని 50 శాతం కుదించేసింది. 30,950 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వాల్సి ఉండగా దాన్ని 15 వేల హెక్టార్లకు తగ్గించేసింది. ఇప్పటిదాకా 9,526.2 హెక్టార్లకు డ్రిప్ అందించారు. తక్కువ నీటి లభ్యత కలిగిన ప్రాంతాలకు డ్రిప్ సాగు వరం. దీనిపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్న రైతులే అత్యధికం. గతంలో లాగా పాదులు కట్టి పంటలకు నీటిని అందించే పరిస్థితి ఇప్పుడు లేదు. ప్రభుత్వం తగ్గించిన లక్ష్యం ఫలితంగా రైతులు రూ.150 కోట్లకుపైగా నష్టపోవాల్సి వస్తోంది. ఒక్కో రైతుకు హెక్టారుకు డ్రిప్ అందిస్తే దీని విలువ రూ.1.21 లక్షలు. ఇందులో రైతు వాటా రూ.20వేలు కడితే ప్రభుత్వం రూ.లక్ష రాయితీ ఇస్తుంది. దీంతో రైతులకు ప్రభుత్వం అన్యాయం చేసినట్టే.



ఈ మండలాలకు ఇక లేదు..

డ్రిప్ లక్ష్యాన్ని 15వేల హెక్టార్లకు కుదించడంతో జిల్లాలోని మండలాలకు లక్ష్యాలను కుదించారు. దీంతో కొన్ని మండలాలకు కేటాయించిన లక్ష్యం ఇప్పటికే పూర్తయింది. ఫలితంగా డ్రిప్ కోసం ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగులుతుంది. పెద్దతిప్పసముద్రం, కోడూరు, చిట్వేలి, పుల్లంపేట, టి.సుండుపల్లి మండలాలు వాటి లక్ష్యం మేరకు మంజూరు లభించింది. వచ్చే ఏప్రిల్ నుంచే రైతులకు డ్రిప్ అందిస్తారు. కాగా ఇప్పటిదాకా మంజూరు చేయగా ఇంకా 5,474 హెక్టార్లకు డ్రిప్ అందించాల్సి ఉంది. వచ్చేనెల మార్చిలోగా ఈ టార్గెట్ పూర్తి చేయకుంటే రైతులకు ప్రయోజనం కలగకపోగా నష్టపోనున్నారు.

పూర్తి చేస్తాం..



ప్రస్తుత ఆర్థిక సంవత్సర లక్ష్యాలను ప్రభుత్వం తగ్గించింది. కొత్త రాయితీలు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలవుతాయి. జిల్లా లక్ష్యాలను మార్చిలోపు పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూరుస్తాం. కంపెనీలు సకాలంలో రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. –లక్ష్మీప్రసన్న, సూక్ష్మ నీటి పారుదల జిల్లా అధికారిణి

50 శాతం తగ్గింపుతో లక్ష్యం (హెక్టార్లలో)

మండలం	లక్ష్యం	మంజూరు
మదనపల్లె	500	255
నిమ్మనపల్లె	450	213
రామసముద్రం	500	335
తంబళ్లపల్లె	525	262
ములకలచెరువు	700	422
పెద్దమండ్యం	476	134
కురబలకోట	300	171
పెద్దతిప్పసముద్రం	400	632
బి.కొత్తకోట	750	381
కలికిరి	450	199
వాయల్పాడు	450	200
పీలేరు	450	207
గుర్రంకొండ	450	126
కలకడ	450	150
కేవీపల్లి	500	406
కోడూరు	475	508
ఓబులవారిపల్లి	800	781
చిట్వేలి	425	542
పెనగలూరు	350	268
పుల్లంపేట	450	520
రాజంపేట	750	505
నందలూరు	150	61
వీరబల్లి	450	228
టి.సుండుపల్లి	350	365
రాయచోటి	300	179
సంబేపల్లి	750	190
చిన్నమండెం	450	272
గాలివీడు	750	472
లక్కిరెడ్డిపల్లి	600	274
రామాపురం	600	255

పంచాయతీ నిధులు కాజేస్తూ.. గన్‌తో బెదిరింపులు

పీలేరు పంచాయతీ ఈఓ అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



పీలేరు ఈఓపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

రాయచోటి: పీలేరు పంచాయతీ ఈఓ గురుమోహన్ అవినీతి అక్రమాలకు పాల్పడడమే కాకుండా సమస్యలపై ప్రశ్నించిన వారికి తనవద్ద ఉన్న గన్ చూపించి బెదిరిస్తున్నారంటూ పీలేరు సర్పంచ్, పాలకవర్గం సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాయచోటిలోని అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను సర్పంచ్ హబీబ్ బాషా, వార్డు సభ్యులు కలిసి ఫిర్యాదు చేశారు. కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకపోగా కొన్ని నెలలుగా వారికి ఇవ్వాల్సిన ఈపీఎఫ్ డబ్బులు డిపాజిట్ చేయలేదన్నారు. అలాగే జనరల్ ఫండ్ నిధులను ఎక్కడ ఎంత ఖర్చు చేస్తున్నారన్న విషయాన్ని కూడా చూపించడం లేదన్నారు. పంచాయతీకి జమ అవుతున్న నిధులు వివరాల గురించి సర్పంచ్, వార్డు సభ్యులు అడిగితే తమవద్ద ఉన్న గన్ చూపించి బెదిరిస్తున్నారని, గన్ విషయంపై విచారణ చేసి పీలేరులో గొడవలకు కారణం అవుతున్న ఈఓ గురుమోహన్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈఓ గురు మోహన్, డీఎల్‌పీఓ నాగరాజ వారికి ఇష్టం వచ్చిన రీతిలో నిధులను డ్రా చేసి స్వాహా చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వార్డు సభ్యులు లలితమ్మ, వెంకటరమణ, మల్లికార్జున రెడ్డి, కళావతి, పరమేష్ తదితరులు ఉన్నారు.

వైవీయూ వీసీగా ఫణితి ప్రకాష్‌బాబు నియామకం

కడప ఎడ్యుకేషన్: కడప యోగివేమన విశ్వ విద్యాలయం నూతన వైస్ చాన్సలర్‌గా ఫణితి ప్రకాష్ బాబు నియమితులయ్యారు. విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాష్‌బాబు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కట్టుదిట్టంగా మిషన్ వాత్సల్య కార్యక్రమం

రాయచోటి: పిల్లల సంక్షేమమే ధ్యేయంగా మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి జిల్లాలో బాల్య వివాహాలను రూపుమాపాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మిషన్ వాత్సల్య కార్యక్రమంపై జిల్లాస్థాయి బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మిషన్ వాత్సల్యను కట్టుదిట్టంగా అమలు చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అది సాధ్యమవుతుందన్నారు. మిషన్ వాత్సల్య కార్యక్రమంలో అనాథ పిల్లలు, ప్రత్యేక రక్షణ కావాల్సిన పిల్లలు, నేరాల బారిన పడిన పిల్లలు తదితరులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి రమాదేవి, రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, మదనపల్లి, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, జీఎస్‌డబ్ల్యుఎస్, విద్య, వైద్య, సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి
- నిర్లక్ష్యం వహించిన ఐదుగురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు



కంచిపట్లవాండ్లపల్లెలో ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

సుండుపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా, రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై నిర్లక్ష్యం వీడి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సుండుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కారం ప్రగతిపై తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్‌ఓ, వీఆర్ఏలతో సమీక్షించారు. మండలంలో మొత్తంగా భూమి సమస్యలపై 506 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ దైవాధీనం కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపకుండా ప్రగతిలో వెనుకబడిన తిమ్మసముద్రం వీఆర్‌ఓ చిట్టిబాబు , గ్రామ సర్వేయర్ సుబ్బరాయుడు, జి. రెడ్డివారిపల్లి వీఆర్‌ఓ నరసింహులు, ముడుంపాడు వీఆర్‌ఓ హరీష్, బాగంపల్లి వీఆర్‌ఓ కొండయ్యలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా ప్రగతి చూపకపోతే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన మొత్తం అర్జీలను నాణ్యతగా పరిష్కరించడమే అధికారుల లక్ష్యం కావాలని సూచించారు. క్షేత్ర స్థాయికి వెళితే భూసేకరణ, దారి సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. తర్వాత సుండుపల్లె-3 పరిధిలో కంచిపట్లవాండ్లపల్లె సమీపంలో ప్రభుత్వ భూమి ఆక్రమణను పరిశీలించారు. గ్రామస్తుల సౌకర్యం కోసం అదే ప్రాంతంలో స్మశాన వాటిక నిమిత్తం భూమి కేటాయింపునకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

కుంభమేళా.. రైలెక్కేదెలా!

- 26తో ముగియనున్న కుంభమేళా
- గుత్తి–రేణిగుంట మార్గంలో ఒక్క రైలు కూడా లేని వైనం
- ప్రయాగ్‌రాజ్ ప్రయాణానికి ఇక్కట్లు
- రహదారి మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు



రాజంపేట: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా విశేషాలపై చర్చ సాగుతోంది. ఈనెల 26న మహాశివరాత్రి రోజు మహా కుంభమేళా వేడుకలు ముగియనున్నాయి. 144 ఏళ్లకొకసారి వచ్చే ఈ ఉత్సవాల సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానం ఆచరించడం మంచిదని భక్తుల అచంచల విశ్వాసం. అందుకే ప్రయాగ్‌రాజ్‌కు నడిపిస్తున్న రైళ్లు భక్తులతో రద్దీగా మారుతున్నాయి. ఎంతగా అంటే తత్కాల్ టికెట్లు కూడా క్షణాల్లో రిజర్వు కావడం డిమాండ్‌ను తెలియజేస్తోంది.

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ వల్ల ఒరిగిందేమీలేదు: భారతీయ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎంపీ సీఎం రమేష్ ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి మేలు చేసే విధంగా కనిపించడంలేదని జిల్లా ప్రజలు విమర్శిస్తున్నారు. రైల్వేబోర్డుకు స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా తాను సిఫార్సు చేసి ఉంటే కుంభమేళాకు రైలు నడిపేవారు. అయినా ఆయన జిల్లా మీదుగా కుంభమేళాకు రైలు వేయించుకోలేకపోయారని భక్తులు పెదవి విరుస్తున్నారు.

ప్రైవేటు వాహనాలు, బస్సులను ఆశ్రయించే పరిస్థితి..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు కుంభమేళాకు వెళ్లేందుకు రైలు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలు, బస్సులను ఆశ్రయించే పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు భక్తులు గ్రూపులుగా ఏర్పడి ప్రత్యేకంగా బస్సులు మాట్లాడుకొని వెళుతున్నారు. ఇలా వెళ్లే వారి సంఖ్య పెరిగిపోవడంతో ప్రయాగ్‌రాజ్ దారులు రద్దీగా మారుతున్నాయి. ఫలితంగా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. కొందరు బెంగళూరు, చెన్నై నుంచి విమానాల ద్వారా కుంభమేళాకు వెళుతున్నారు.

గుత్తి–రేణిగుంట లైనులో ఒక్క రైలేదీ..

గుత్తి–రేణిగుంట లైనులో కుంభమేళాకు వెళ్లేందుకు ఒక్క రైలు కూడా నడిపించలేదు. ఫలితంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే రైళ్ల గురించి తెలుసుకొని వ్యయ ప్రయాసాలతో గూడూరుకు వెళ్లి, అక్కడి నుంచి రైళ్ల ద్వారా చేరుకుంటున్నారు. తిరుపతి నుంచి కూడా ఇప్పుడు కుంభమేళాకు రైలు నడవడంలేదని రైల్వే వర్గాలు అంటున్నాయి. ఉత్తరప్రదేశ్‌కు వెళ్లే రైళ్లు సదరన్ రైల్వే నుంచి వస్తే వాటిని ఆశ్రయించాల్సి వస్తోంది.

ఇంటర్‌సిటీనే కుంభమేళా రైలుగా నడిపించాలి

ఈ మార్గంలో నడిచే పేదోళ్ల రైలు ఇంటర్‌సిటీ(హుబ్లీ–తిరుపతి) రద్దు చేసి, ఆ రైలును కుంభమేళాకు వినియోగించారు. అదే రైలును ఈ మార్గంలో నడిపించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ రైలును తిరుపతి నుంచి ప్రయాగ్‌రాజ్‌కు రోజూ నడిపిస్తే రాయలసీమ ప్రాంత భక్తులకు ఉపయోగపడేది. ఆ దిశగా రైల్వేశాఖ ఆలోచించకపోవడం విచారకరమని హిందూ సంస్థల ప్రతినిధులు వాపోతున్నారు.

జిల్లా వాసులు రైలులో వెళ్లలేని పరిస్థితి



ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు కుంభమేళాకు వెళ్లలేని పరిస్థితి. రైలు సౌకర్యం ఉంటే వేలాదిమంది వెళ్లేవారు. రైలులో గూడూరు నుంచే వెళ్లాలి. టిక్కెట్లు దొరకవు. జనరల్ బోగీలలో వెళితే సీట్లు ఉండవు. నానా కష్టాలు పడాలి. జిల్లా రైలు మార్గంలో రైలు నడిపించకపోవడం దారుణం. మన ప్రాంతంపై రైల్వే వివక్ష చూపుతోంది. –భూమన శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

కుంభమేళాకు రైలు వేయాలని జీఎంను కోరా



జిల్లా మీదుగా కుంభమేళాకు ఒక రైలు నడపాలని ఇటీవల తిరుపతిలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఏకే జైన్‌ను కలిసి విన్నవించాను. కుంభమేళా ముగిసే లోపు ఒక్కసారి అయినా రైలు నడిపిస్తే భక్తులు సద్వినియోగం చేసుకుంటారు. రద్దయిన ఇంటర్‌సిటీనే కుంభమేళాకు ఏర్పాటు చేయాలి. –తల్లెం భరత్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు, గుంతకల్

సురక్షితం.. సౌకర్యం..

ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే వారికి రైళ్లు సురక్షితం. తక్కువ ఖర్చుతో గమ్యానికి చేరుకోవచ్చు. దీంతోపాటు రైల్వేస్టేషన్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోనే త్రివేణి సంగమం చేరుకోవచ్చు. అక్కడే పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు తక్కువ ఖర్చుతో సకాలంలో చేరుకొనే వీలుంటుంది. వాహనాలు లభ్యంకాని భక్తులు నేరుగా నడకమార్గం ద్వారా చేరుకునే అవకాశాలు ఉన్నాయి. రైల్వేశాఖకు రూ.కోట్ల ఆదాయం కూడా సమకూరుతుంది.

అభ్యసన సామర్థ్యాల పెంపునకే సాల్ట్ కార్యక్రమం



మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

రాయచోటి అర్బన్: విద్యార్థుల్లో ప్రాథమిక దశలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 'సాల్ట్' పేరుతో అంగన్‌వాడీలకు 120 రోజుల సర్టిఫికెట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక దశలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు అంగన్‌వాడీ వర్కర్లు కృషి చేయాలన్నారు. ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రమాదేవి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పిల్లల అభివృద్ధికి వినియోగించాలన్నారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, మండల విద్యాశాఖాధికారులు బాలాజీ నాయక్, వెంకటశివారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక దశలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగు పరచడం ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు రాజారమేష్, వెంకటసుబ్బయ్య, సికిందర్, నాగమణి, సుగుణ, శివజ్యోతి, ఎఫ్ఎల్ఎస్ కో–ఆర్డినేటర్ రాజశేఖర్, సీఆర్‌పీలు అరుణ్‌బాబు, రవిప్రకాష్, మండల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కజొన్న పంటకు నిప్పు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లు సమీపంలో మంగళవారం ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు నరసింహులుకు రూ.4 లక్షల నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే మద్దయ్యగారిపల్లి పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ నరసింహులు పులికల్లు సమీపంలో నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పురవ్వలు పంటపై వేయడంతో మంటలు వ్యాపించాయి. ఈ తరుణంలో రెండు ఎకరాల్లో పంట దెబ్బ తినడంతోపాటు స్టాటర్, డ్రిప్ పైపులు, పైప్‌లైన్, ల్యాడర్లు, బోరు కేసింగ్ పైపులు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న ములకలచెరువు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు పేర్కొన్నాడు.

కొట్టం దగ్ధం

గాలివీడు : మండలంలోని ఇడవన్‌చేనుపల్లెకు చెందిన కె.లోకేష్‌రెడ్డికి చెందిన బోద కొట్టం మంగళవారం మధ్యాహ్నం దగ్ధమైంది. ఇందులో నిల్వ ఉంచిన రూ.50 వేల విలువ చేసే ఉలవలు కాలిపోయినట్లు తెలిపారు. అధికారులు ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

కలకడ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురు ద్విచక్రవాహన దారులపై కేసు నమోదు చేసి వాల్మీకిపురం సివిల్ కోర్టులో హాజరుపరిచనట్లు ఎస్‌ఐ రామాంజ నేయులు తెలిపారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.11వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

ఒంటిమిట్ట : మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో సోమవారం బుడుసు హరి అనే వ్యక్తిపై దాడి చేసిన విషయం విదితమే. ఈ ఘటనపై ఒంటిమిట్ట ఎస్‌ఐ శివ ప్రసాద్ మంగళవారం కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. హరి అనే వ్యక్తిపై గత కొంతకాలంగా పాతకక్షలు పెట్టుకున్న నంద్యాల ఆకాష్, అజయ్, రమేష్, వెంకటేష్ సోమవారం చిన్న కొత్తపల్లికి వెళ్లారు. ఒంటరిగా ఆటోలో వస్తున్న హరిని కాపు గాసి రోకలి కర్రతో దాడి చేశారు. ఈ దాడిలో బుడుసు హరికి కాళ్లు, కుడిచేయి, తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

22న జాతీయ సదస్సు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వ విద్యాలయంలో ఈ నెల 22న ఉర్దూ కవిత, సాహిత్యంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉర్దూ విభాగం ఆచార్యులు రియాజున్నీసా తెలిపారు. సదస్సులో ఉర్దూ సాహిత్యం, దాని ప్రాముఖ్యత, ఉర్దూ స్థితి, కడపలో ఉర్దూ సాహిత్యంతిపై చర్చ జరుగుతుందని తెలిపారు. సాహిత్య వర్గాలు, అధ్యాపకులు, విద్యార్థులంతా సదస్సులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదనపు సమాచారం కోసం 9885348482లో సంప్రదించాలన్నారు.

ఉత్సవాలకు వేళాయె.. సందడి లేదాయె ?

ప్రముఖ శైవ క్షేత్రంగా కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానం విరాజిల్లుతోంది. అంత వైభవం కలిగిన త్రేతేశ్వరుడి వేడుకల నిర్వహణలో కూటమి ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. మహాశివరాత్రి మహోత్సవాల సందడి కనపడడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దేవస్థానంలో సమస్యలు అలాగే ఉండిపోయాయి.

- త్రేత్రేశ్వరస్వామి ఆలయంలో కానరాని ఏర్పాట్లు
- శివరాత్రి మహోత్సవాలపై అయోమయం
- 9 రోజుల వేడుకలకు మంగళమేనా?
- అత్తిరాలపై కూటమి ప్రభుత్వం అలసత్వం


కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానం


అత్తిరాల ముఖద్వారం వద్ద అసంపూర్తిగా ఉన్న రహదారి

రాజంపేట రూరల్ : ఉమ్మడి జిల్లాలలో ప్రముఖ శైవ పుణ్య క్షేత్రం కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానంలో ఏటా శివరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పాలకులు ఎవరైనా ఈ ఆలయానికి ప్రత్యేకత చూపడం సంప్రదాయంగా వస్తోంది. ఉత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది బహుదా నదిలో పుణ్య స్నానాలు చేస్తారు. అగస్తేశ్వర మహర్షి ప్రతిష్ఠించిన త్రేతేశ్వరస్వామి, గదాధర స్వామిని దర్శించుకోవడం వరంలా భావిస్తారు. దీంతోపాటు అత్తిరాలలోనూ ఏటా శివరాత్రి ముందు రోజు, తరువాత రోజు, శివరాత్రి పర్వదినం రోజున పలు కార్యక్రమాలు చేపడతారు.

పాలక మండలి ఏర్పాటు ఎప్పుడో?.

త్రేతేశ్వర దేవస్థానంలో నిర్వహించే శివరాత్రి మహోత్సవాలకు ముందే పాలక మండలి ఏర్పాటుచేయడం ఆనవాయితీ. అలా వీలుకాని పక్షంలో తాత్కాలిక చైర్మెన్‌ను నియమించి శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. దేవస్థానం చైర్మన్ పదవి, పాలక మండలిపై మందరం, అత్తిరాల, అప్పయ్యరాజుపేట, పోలీ, సీతారామపురం కూటమి నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడచినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై ప్రజలలో అయోమయం నెలకొంది.

22 నుంచి ఉత్సవాలు జరిగేనా?

శివరాత్రి మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభించి మార్చి 02వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంది. సమయం తక్కువగా ఉండడంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారా? లేక వేడుకలకు మంగళం పాడతారా? అని భక్తులు సంశయం వ్యక్తం చేస్తున్నారు. శివరాత్రి పర్వదినానికి నెల రోజుల నుంచి హడావిడి ఆరంభమయ్యేది. అన్ని శాఖల అధికారులతో డివిజనల్ స్థాయి(ఆర్‌డీఓ లేక సబ్ కలెక్టర్) అధికారి సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేస్తారు. అత్తిరాలను ఉన్నతాధికారులు సందర్శించి దేవాదయశాఖతో సమన్వయం చేసుకని ఏర్పాట్లు ప్రారంభిస్తారు. అయితే ఈ ఏడాది ఈ వాతావరణం కనిపించకపోవడం అనుమానాలకు దారితీస్తోంది.

సౌకర్యాల ఊసే లేదు

శివరాత్రి మహోత్సవాలకు దాదాపు 7 నుంచి 15 రోజుల ముందు వాహనాల గేటుకు ఎంపీడీఓ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకూ వేలం వేయక పోవడం వెనుక అంతర్యమేమిటో అర్థంకాక భక్తులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు రాజంపేట-నెల్లూరు ప్రధాన రహదారిలోని అత్తిరాల ముఖ ద్వారం వద్ద నుంచి త్రేతేశ్వర దేవస్థానం వరకు రోడ్డు సమస్య పీడించేది. కమ్మపల్లిలో మాత్రం కొంత దూరం సిమెంటు రహదారి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సిమెంటు రోడ్డు ప్రారంభించాలని తలపెట్టినా అర్ధంతరంగా కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో రహదారికి ఇరువైపులా గుంతలు, మట్టి దిబ్బలు అలాగే ఉన్నాయి. అత్తిరాలకు విచ్చేసే భక్తులకు పార్కింగ్ సమస్యలు తప్పవు. రహదారి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

లబోదిబోమంటున్న వ్యాపారులు

శివరాత్రి మహోత్సవాలలో చిరు అంగళ్లు ఏర్పాటు చేసుకొని జీవించాలనుకొనే వ్యాపారులు లబోదిబోమంటున్నారు. త్రేతేశ్వరుని దేవస్థానం సమీపంలో రహదారి నిర్మాణం అలాగే ఉండడంతో వ్యాపారులు అంగళ్లను ఏర్పరుచుకోనే వీలులేదు. ఇప్పటి నుంచే అంగళ్లు ఏర్పరుచుకోకుంటే అప్పటికప్పుడు కష్టంగా ఉంటుంది. వాహనాలలో సమాగ్రిని తీసుకెళ్లేందుకు వీలు కాకపోవడంతో ఎంతో నష్టపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంక స్థలం ఆక్రమణ


అధికార పార్టీ నేతలు చదును చేసి ఆక్రమించిన వంక పొరంబోకు స్థలం

- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- ఆక్రమించింది టీడీపీ నేత కావడమే కారణం

కడప టాస్క్‌ఫోర్స్ : ప్రభుత్వ స్థలాలు అప్పనంగా కాజేస్తున్నా.. ప్రజా ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సిద్దవటం మండలం దిగువపేట నందు బద్వేల్ రోడ్డు ప్రక్కనే ఉన్న రూ.50 లక్షల విలువైన స్థలం ఆక్రమణకు గురైంది. దిగువపేట పెద్ద కుమ్మరి గుంతకు ఎదురుగా ఉన్న ఈ స్థలాన్ని టీడీపీ నాయకులు స్థానిక మండల నేతల అండదండలతో దౌర్జన్యంగా చదును చేసి ముళ్ల కంచె వేశారు. సుమారు 0.43 సెంట్ల స్థలాన్ని దిగువపేట గాంధీ నగర్ హరిజన వాడ ప్రజలు కర్మ కాండలకు వినియోగిస్తున్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే పెద్ద కర్మ ఇక్కడే చేసుకుంటారు, భర్త చనిపోయిన మహిళలకు ఇక్కడే వితంతువుగా మారుస్తారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఇది కొంత ప్రభుత్వ భూమిగా, మరి కొంత వంకపొరంబోకుగా ఉంది. ఈ వంకపై ప్రభుత్వం ఒక మోరీ గతంలో నిర్మించింది. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు ఈ వంకను నామరూపాలు లేకుండా చేశారు. బద్వేల్ మెయిన్ రోడ్డు ప్రక్కనే ఉన్న విలువైన స్థలాన్ని చదును చేసి ఆక్రమిస్తుంటే కూతవేటు దూరంలో ఉన్న రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం ఏమిటని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ స్థలం విషయంలో రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు వారు గుసగుసలాడుతున్నారు. కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని టీడీపీ కబ్జాదారుల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

సీఐపై ఫిర్యాదు చేసినందుకు వేధిస్తున్నాడు


ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ ఆనంద్

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకు తనను కులం పేరుతో వేధిస్తున్నాడని రాయచోటి ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గుంటిమడుగు ఆనంద్ ఆరోపించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. దీక్షకు అనుమతులు లేకుండా చేస్తున్నారని, తన నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేశారని విమర్శించారు. కొన్ని రోజుల క్రితం తన కులానికి చెందిన వారి సమస్యలను పరిష్కరించేందుకు రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని, ఆయన ఎదుట కుర్చీలో కూర్చోగా.. ఆవేశంతో ఆగ్రహించి తనపై నానా దుర్భాషలాడి భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. అర్బన్ సీఐ చంద్ర శేఖర్ వివరణ కోరగా.. ఆనంద్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా సమాజాన్ని పక్కదోవ పట్టిస్తున్నాడని, అందుకే బీఎన్ఎస్ 350 కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తాను ఎప్పుడూ కులం పేరుతో ఎవరినీ దూషించలేదని, కావాలనే ఆయన ఆరోపణ చేస్తూ తన ప్రాబల్యాన్ని పెంచుకొనేందుకు ప్రయత్నిస్తున్నాడన్నాడు. పోలీస్ శాఖలో ఉంటూ సమాజంలోని అన్ని వర్గాల వారిని సమానంగా చూస్తామన్నారు.

నిధుల కేటాయింపులో సీమను విస్మరిస్తే ఉద్యమం



మాట్లాడుతున్న జి.ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నీటి పారుదల శాఖ రాయలసీమను విస్మరిస్తే ఉద్యమం చేపడతామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కడపలో జరిగే ప్రాజెక్టుల ప్రాంతీయ సదస్సు కార్యాచరణ వేదిక కానుందన్నారు. రూ.80 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన గోదావరి - భనకచర్ల ఎత్తిపోతల పథకం కాంట్రాక్టర్ల కడుపు నింపి ఎన్నికల నిధి పోగు చేసుకోవడానికి ఉపయోగపడుతోందని ఆరోపించారు. కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణ ద్వారా శ్రీశైలంలో క్యారీ ఓవర్ నీళ్లను రాయలసీమ ప్రాజెక్టులకు వాడుకునే వెసులుబాటు ఉంటుందని చెబుతూ వచ్చారని, నేడు కొత్త ప్రతిపాదనల పేరుతో రాయలసీమ ప్రజలను మభ్యపెడుతున్నారని వాపోయారు. పోలవరం పూర్తిచేస్తే పట్టిసీమకు ప్రాధాన్యం ఉండదని తెలిసినా రూ.1600 కోట్ల రూపాయలు ఖర్చు చేశారన్నారు. సీమ ప్రాజెక్టులకు రూ.10వేల కోట్లు కేటాయిస్తే ప్రాధాన్యత క్రమంలో పంట కాల్వల నిర్మాణం పూర్తయి పది లక్షల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి చెందుతుందని ఆరోపించారు. కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్వార్థ రాజకీయాలతో ఎగువ భద్ర ప్రాజెక్టుకు బీజేపీ ప్రభుత్వం జాతీయ హెూదా కల్పించిందన్నారు. శ్రీశైలం నీటిమట్టం 834 అడుగులకు రాకముందే నీటిని తోడేస్తున్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట శివ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్లకు అన్యాయం


మాట్లాడుతున్న మదీనా దస్తగిరి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలోని మౌజన్లు, ఇమామ్‌లకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మదీనా దస్తగిరి అన్నారు. స్థానిక మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇమామ్‌లు, మౌజన్లకు నెలకు రూ.15వేల చొప్పున ఇచ్చేవారని, 2024లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి 11 నెలలుగా వారికి గౌరవవేతనం ఇవ్వలేదన్నారు. ఇప్పటి వరకూ వారికి రూ.90 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం రూ.45కోట్లు ఇవ్వడానికి జీవో విడుదల చేయడం అన్యాయమన్నారు. రానున్న రంజాన్ మాసంలో ఎక్కువ ఖర్చులు ఉంటాయని, ప్రభుత్వం ఆ మిగిలిన రూ.45 కోట్లు విడుదల చేయాలన్నారు. కడప అసెంబ్లీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ఎస్ఎండీ.షఫీ మాట్లాడుతూ గతంలో హజ్‌కు పోయే వారికి విజయవాడ నుంచి అధిక టికెట్లు ఉంటే అప్పటి సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆ భారాన్ని ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులిచ్చారని గుర్తు చేశారు. వక్ఫ్ ఆస్తులను ఆక్రమించడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో వైఎస్సార్‌సీపీ మాత్రమే వ్యతిరేకించిందని గుర్తు చేశారు. హజ్ కమిటీ మాజీ చైర్మెన్ గౌస్‌లాజం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముస్లిం, మైనార్టీలకు ఒరిగిందేమీ లేదన్నారు. 3529 మందిని ఒకేసారి హజ్‌కు పంపిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. జగనన్న ప్రభుత్వంలో ముస్లింలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.23వేల కోట్లు జమ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంద్‌బాషా, అతావుల్లా, మియ్యా, అహమ్మద్ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

– పాఠశాలకు వెళ్లి చదువుకోలేక...!


సుచిత్ర (ఫైల్)

కడప అర్బన్ : పాఠశాలకు వెళ్లడం లేదని మందలించినందుకు విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కడప నగర శివారులోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. కడప చిన్నచౌక్ పోలీసుల ప్రాథమిక విచారణ, మృతురాలి బంధువుల వివరాలిలా వున్నాయి. దేవకుమార్, ప్రభావతిల కుమారుడు మస్తానయ్య, సన్నీ కుమార్తె సుచిత్ర ఉన్నారు. మస్తానయ్య తన తండ్రితో పాటు బేల్దారిపనికి వెళుతున్నాడు. తల్లి ప్రభావతి ఇంటింటా పనులు చేసి జీవనం సాగించేది. సుచిత్ర మున్సిపల్ మెయిన్ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. సుచిత్ర తన అనారోగ్యం కారణాలతో నెలకు 15 రోజులు మాత్రమే పాఠశాలకు వెళ్లేది. హాజరు సరిగా లేక ఇటీవల పాఠశాలలో ఉపాధ్యాయులు ఆమె తల్లి దండ్రులను ఆరా తీశారు. దీంతో మానసిక ఆవేదనకు గురైన విద్యార్థిని సుచరిత తల్లిదండ్రులు, అన్న, తమ్ముడు వెళ్లిపోయిన తరువాత ఇంటిలోపల గడియ వేసుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుప్రక్కల వాళ్లు గమనించి తల్లిదండ్రులకు, పోసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని చిన్నచౌక్ సీఐ ఓబులేసు ఆదేశా మేరకు ఎస్‌ఐ పి.రవికుమార్, తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రాథమికంగా విచారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో.. కారు ఢీకొని.. పలువురికి గాయాలు



గాయపడిన వేమారెడ్డి, అలివేలమ్మ

మదనపల్లె : ఆటోను కారు ఢీకొనడంతో ఐదుగురు గాయపడ్డారు. మదనపల్లె ఎస్టేట్‌కు చెందిన బావా జాన్ (40) ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. సీటీఎం నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని వస్తుండగా జెర్సీ పాలడెయిరీ సమీపంలో స్పీడ్‌బ్రేకర్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఆటోను వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ బాబ్‌జాన్‌తోపాటు రామసముద్రం మండలం చింపరపల్లెకు చెందిన చిన్న అబ్బయ్య(61), అతని భార్య అలివేలమ్మ(55), మదనపల్లె పట్టణం బాలాజీనగర్‌కు చెందిన కౌసర్ (46), తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె పంచాయతీ చెరువుముందరపల్లెకు చెందిన వేమారెడ్డి (64) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం వేమారెడ్డి, అలివేలమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో...

రామాపురం : కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి వివరాల మేరకు.. మండలంలోని ఓబుల్‌రెడ్డిగారి పల్లెకు చెందిన వెంకటసుబ్బరాయుడు, శ్రీనివాసులు, వెంకట సుబ్బరాయుడు జగనన్న కాలనీలో పనులు చేసేందుకు స్కూటర్‌పై వెళ్తున్నారు. రాయచోటి వైపు వెళ్తున్న కడపకు చెందిన మౌలాలి స్కూటర్‌పై వసుత్నారు. బండపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీ సమీపంలో రెండు స్కూటర్లు ఢీకొన్నాయి. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రాయచోటి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మండల పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని...

మదనపల్లె : ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి గాయపడిన సంఘటన చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగింది. పుంగనూరు మండలం ఏటవాకిలికి చెందిన శ్రీరాములు (48) వ్యక్తిగత పనులపై ద్విచక్రవానంలో పుంగనూరు పట్టణానికి వచ్చాడు. బిఆర్ థియేటర్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో శ్రీరాములు గాయపడ్డారు. స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నల్ల రిబ్బన్లతో వైద్య మిత్రల నిరసన


నిరసన తెలుపుతున్న వైద్యమిత్రలు

రాయచోటి జగదాంబసెంటర్ : డా.ఎన్‌టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న వైద్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. వైద్యమిత్రలు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ జరగక, పిల్లలను చదివించుకోలేక ఇబ్బందిపడుతున్నామన్నారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకాన్ని బీమా మోడ్‌లోకి బదలాయించినా పథకంలో పని చేస్తున్న వైద్యమిత్రలు, టీం లీడర్లు, ఆఫీసు అసోసియేట్లు, జిల్లా మేనేజర్ తదితర క్షేత్ర స్థాయి సిబ్బంది ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.

ఫైనాన్స్ మోసం రూ.70 లక్షలు?

– లబోదిబోమంటున్న ఖాతాదారులు

బి.కొత్తకోట : పట్టణంలోని ఓ ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్‌లో బంగారం తాకట్టుపై రుణాల మంజూరు వ్యవహారంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించిన విషయం తెలిసిందే. ఈ రుణాలపై ఇటీవల ఆరోపణలు రావడంతో ఆ కంపెనీకి చెందిన ఆడిటర్లు, విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఇందులో రూ.40 లక్షల మేర తాకట్టు రుణాలపై మళ్లీ అధిక మొత్తాల్లో రుణాలు తీసుకుని కొందరు సొంతానికి వాడుకున్నట్లు తేలింది. మరో రూ.30 లక్షల కంపెనీ ఉత్పత్తులకు సంబంధించిన సొమ్ముకు లెక్కలు తేలినట్టు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంలో ముగ్గురు సిబ్బంది ఉన్నటుల్ల నిర్ధారించిన బృందాలు వారిపై ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై కంపెనీకి నివేదించినట్లు తెలిసింది. ఆ ముగ్గురిలో ఒకరిద్దరు అందుబాటులో లేరన్న ప్రచారం జరుగుతోంది. ఈ మోసం వెలుగులోకి రావడంతో ఖాతాదారులు లబోదిబో మంటున్నారు. తమకు జరిగిన మోసం, అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారినుంచి స్వాహా చేసిన సొమ్మును రాబట్టాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.

జేసీబీతో రహదారిని తవ్వేశారు


యర్రప్పగారిపల్లెకు వెళ్లే రోడ్డు జేసీబీతో తవ్వేయడంతో నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె : ఏళ్ల తరబడి ఉన్న రహదారిని కొందరు వ్యక్తులు తవ్వేశారు. మండలంలోని కోనంపేట నుంచి యర్రప్పగారిపల్లెకు వెళ్లేందుకు రహదారి ఉంది. ఇటీవల రైతు కొనసాని వెంకట సుబ్బారెడ్డి ఆ దారి తన పట్టా భూమి అంటూ తవ్వేశారు. అదే రోడ్డు మార్గంలో ఇంకో రైతు నాగిరెడ్డి తన పొలంలోకి వస్తుందంటూ జేసీబీతో తవ్వేశారు. దీంతో ఆదారిన ఉండే గ్రామాలకు జనం, విద్యార్థులు కూడా నడచి వెళ్లాల్సి వచ్చింది. ఆటోలు, స్కూల్ బస్సులు, ట్రాక్టర్లు వెళ్లకుండా తవ్వేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని రహదారిని పురుద్ధరించాలని స్థానికులు కోరారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ


యజమానికి బ్యాగ్ అందజేస్తున్న ఆటో డ్రైవర్ హరిబాబు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలో ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటాడు. రాయచోటి అర్బన్ ఎస్‌ఐ అబ్దుల్ జాహీర్ కథనం మేరకు..మదనపల్లెకు చెందిన మహబూబ్‌బాషా, భార్యతో కలిసి రాయచోటికి వచ్చాడు. పనులు పూర్తిచేసుకొని మార్కెట్ వద్ద ఆటో ఎక్కి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. ఆటోలో తన భూమికి సంబంధించిన పత్రాలను(ల్యాండ్ డాక్యుమెంట్ పేపర్లు) మరచిపోయాడు. తరువాత ఆటో డ్రైవర్ అక్కడి నుంచి తిరిగి స్టాండ్‌లోకి వెళ్లాడు. వెళ్లిన తరువాత డ్రైవర్ హరిబాబు తన ఆటోలో ఉన్న బ్యాగ్‌ను పరిశీలించి వెంటనే అర్బన్ పోలీ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అందులో ఆధారాల ప్రకారం మహబూబ్ బాషాకు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారికి పత్రాలు ఉన్న బ్యాగ్ అందజేశారు. దీంతో ఆటో డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏపీఎండీసీ టెండర్లను రద్దు చేయాలి


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : మంగంపేట బెరైటీస్ టెండర్లలో ఏపీఎండీసీకి నష్టం వచ్చే విధంగా వేసిన టెండర్లను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నసింహులు డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు కొమ్ము కాయకుండా కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని కొత్త టెండర్లను పిలవాలని డిమాండ్ చేశారు. ఈ టెండర్ల వలన సంస్థ మనుగడకే ప్రమాదని హెచ్చరించారు. దీని వలన ఏపీఎండీసీలో పని చేస్తున్న 2000 మంది కార్మికుల భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థలో పని చేస్తున్న 20 వేల కుటుంబాలపై ప్రభావితం చేస్తుందనిన్నారు. సీఎం చంద్రబాబు టెండర్లను సమీక్షించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మల రామకృష్ణ, పండుగోల మణి, దార్ల రాజశేఖర్, జ్యోతి చిన్నయ్య, సెల్వంకుమార్, జయరామయ్య, మోడీ శివయ్య, నాగేశ్వరరావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ కింద పడి మహిళ మృతి

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన దారాల ఆరోగ్యమ్మ (52) ట్రాక్టర్ ట్రాలీ కింద పడి మంగళవారం మృతి చెందినట్లు రాజుపాళెం ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఆ గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో శనగ పంట కోతకు వెళ్లిన ఆరోగ్యమ్మ పొలం వద్దనే ఉన్న ట్రాక్టర్ ట్రాలీ వద్ద సేద తీరుతోంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్ తోలడంతో ఈ సంఘటన చోటు చేసుకుందన్నారు. ట్రాలీ కింద పడిన ఆరోగ్యమ్మకు తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు చెప్పారు. మృతురాలి కుమారుడు దారాల చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు. శవాన్ని ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.